# తగలబడ్డ!




"ఒసేవ్! ఎక్కడ తగలబడ్డావూ......! ఇటూ!"

"ఆ...వస్తున్నా!"

"అక్కడ ఏం తగలబెడుతున్నావే! త్వరగా రా!"

"ఏమిటూ రంకెలు! ఏదో కొంపలు తగలబడుతున్నట్లు!" భర్త అరుపులు విని అట్లకాడలా చేత్తో పట్టుకొని బయటకు వచ్చింది పార్వతమ్మ.

"ఈ చిన్నోడు ఎక్కడ తగలబడ్డాడు అంట" అడిగారు రామయ్యగారు.

"ఏమో! నాకేం తెలుసు ఎక్కడ తగలబడ్డాడో! అక్కడ అట్లుమాడి తగలబడుతున్నాయి."

"నాకు ఓ నాలుగట్లు తొందరగా తగలబెట్టు నేను పోవాలి"

"బయట ఏం రాచకార్యాలు తగలబడుతున్నాయి అంత తొందర?"లోపలనుండి అరిచింది.

"నాన్నా! మా క్లాసు పిల్లలు సినిమాకు పోతున్నారు నేనూ వెళ్ళద్దా!" అడిగింది కూతురు రాణి.

"ఏం సినిమాకు తగలబడుతున్నార్చా?"

"నిజం చెపితే నమ్మర"

"నమ్మి తగలబడుతాలే చెప్పు ఎందుకు నమ్మమూ?" విసుగ్గా అన్నారు.

"నిజం చెపితే నమ్మరు నాన్నా!"

"నమ్ముతానంటున్నాగా!"

"అబ్బా! అది సినిమా పేరు నాన్నా!' విసుగ్గా అన్నది.

"నా దగ్గర డబ్బులు తగలబడలేదు"

"అమ్మ ఇచ్చిందిలే నాన్నా" అన్నది నవ్వుతూ.

"అమ్మ తగలబెట్టిందీ! నాకు తెలుసు. తగలబెట్టే గుణాలు అన్నీ అదే నేర్పుతుందని! ఇంకేం! ఇహ తగలబడు!"

"వస్తాను నాన్నా!"అంటూ బయటకు వెళ్ళిపోయింది.

గదిలోనుండి సినిమా పాటల రాగంలో ఒక పాట వినిపిస్తున్నది.

"గదిలో ఈగలు మూగే...! తోలలేక నే నోడే...!" (మదిలో వీణలు మోగే ఆశ లెన్నో నెలరేగే)

"ఏరా పెద్దోడా! ఇంకా ఇంట్లోనే తగలబడ్డావా!"

"ఆ...ఆ...బయటకు తగలబడబోతున్నా" అంటూ పన్నెండేళ్ల చిట్టిబాబు బయటకు వచ్చి తల్లిదగ్గరకు చేరాడు.

టిఫిన్ సరిపోలేదు అనుకుంటాను. ఆ పిల్లాడికి తిండి పిచ్చి + పాటల పిచ్చీ రెండూ సమానంగా ఉన్నాయి.

"ఆకలి తీరలేదే ...! నా కడుపు నిండలేదే ...!" (తనివి తీరలేదే)

"ఏమిటమ్మా! పచ్చడి ఇంకా పూర్తి కాలేదా? అరే! టయిం అయిపోతున్నది."

"ఈరోజుకు పచ్చడిలేదూ...ఎనిగంటలకో పూర్తి కాదూ ... నా నోటికి రుచిఏలేదూ... ఈ టిఫెనెందులకో బాగా లేదూ ..." (ఈ వీణకు శృతి లేదు)

"నాయనా కవీ! రవి పిలుస్తున్నాడు"

చిట్టిబాబు బయటకువచ్చి వచ్చిన పిల్లవాడితో వెళ్ళబోతుంటే,

"ఎక్కడికి తగలబడుతున్నావురా." అని అడిగారు.

"సినిమాకి"

"ఏం సినిమాకి ?"

"నేనూ మనిషినే!"

"నేను కాదన్నానా ?"

"అది సినిమా పేరులే నాన్నా" అంటూ వెళ్ళబోయాడు.

"ఒరేయ్! డబ్బులు ఎక్కడివిరా!"

"నీ జేబులో నే చూశానులే... అది తీశానులే..." (నీ కన్నులలో నే చూశానులే అది నా రూపమే)

"ఓరే!జేబులో ఒక్క రూపాయిమాత్రమే తగలబడింది! అది కాస్తా నువ్వు తీసుకున్నావురా!" అన్నారు.

కాని చిట్టిబాబు వినిపించుకోలేదు వెళ్ళిపోయాడు.

ఇంతలోకీ పార్వతమ్మ అట్లు తీసుకొని వచ్చింది.

"ఇంతసేపటికాతగలబడేది! ఇంకా నేను ఎప్పటికితగలబడాలి? పర్సులో ఒక్క పైసాకూడా తగలబడలేదు! ఇంకా ఫస్టు తారీఖు ఎప్పటికి తగలబడుతుందో! అట్లు కూడా తగలబడ్డట్లే వున్నాయి!"

"ఏమండీ! పక్కింటి కామాక్షమ్మగారు సినిమాకి పోతున్నారు నేను కూడా వెళ్ళనా ?"

"ఏం సినిమా ?" అట్లు నేవిస్తూ అన్నారు.

"మా నాన్న నిర్దోషి!"

"ఇదిగో నువ్వు ఏమిటే అన్నది" ముఖం చిట్లించి అన్నారు

"మా నాన్న నిర్దోషి అన్నాను! వినిపించిందా ?"

"ఇదిగో మీనాన్న నిర్దోషి అంటే నేను ఒప్పుకోను! ఆరోజు పెళ్ళిరోజు వాచీ ఇస్తానని మాటఇచ్చి ఇంతవరకు కొనివ్వలేదు! అసలు మీనాన్న వాచీ కొని ఇచ్చేదాకా నన్ను తగలబెట్టినా సరే నిన్ను సినిమాకి పంపించను!"